క్లుప్తంగా

టవర్ ఏర్పాటుకు భూమి పూజ



పాలతలలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఆలయ ఈఓ కృష్ణానాయక్

పెండ్లిమర్రి : పాలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో శుక్రవారం ఆలయ ఈఓ కృష్ణానాయక్, బిఎస్ఎన్ఎల్ అధికారులు బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం టవర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ సి బ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వేంపల్లె : పట్టణ పరిధిలో ఉన్న చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో ఏడుగురు జూదమాడుతుండగా పట్టుబడినట్లు ఎస్ఐ తిరుపాలనాయక్ తెలిపారు. శుక్రవారం సీఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి జూద స్థావరాలపై దాడులు నిర్వహించారు. చింతల మడుగుపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెట్ల పొదలలో జూదమాడుతుండగా వారిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుండి రూ.2,300ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిని శనివారం కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు.

ఎరువు దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కడప వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు

వల్లూరు : మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ కడప సహాయ సంచాలకులు శంకర్‌నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లోని రికార్డులను, ఎరువుల స్టాకును పరిశీలించారు. గోడౌన్‌లలో వున్న ఎరువుల నాణ్యతను గురించి ఆరా తీశారు. ఎరువుల దుకాణదారులు అన్ని రకాల ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అంతకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారి సాయిజ్యోతి పాల్గొ న్నారు.

డీసీసీబీ మాజీ డైరెక్టర్ మృతి

చక్రాయపేట : కడప డీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఇల్లూరు సుబ్బన్న(79) శుక్రవారం మృతి చెందారు. మండలంలోని దేవరగుట్టపల్లె దళితవాడకు చెందిన సుబ్బన్న మారెళ్లమడక సహకార పరపతి సంఘం డైరెక్టర్‌గా ఎన్నికై అనంతరం కడప డీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2013 నుంచి 2019 వరకు ఆయన డైరెక్టర్‌గా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయనకు గుండె పోటు రావడంతో మృతి చెందారు.

తుపాన్‌తో పూత నేలపాలు

- వర్షానికి రాలుతున్న శనగ పూత
- ఆందోళనలో రైతులు



వర్షానికి పూత రాలిపోయిన శనగ పంట

సింహాద్రిపురం : తుపాన్ వర్షానికి రబీ సీజన్‌లో సాగు చేసిన బుడ్డశనగ పంటకు పూత రాలి దెబ్బ తింటోంది. ఇప్పటికే తెగుళ్ల బారిన పడి శనగ పంట దెబ్బతినగా, తుపాన్ వర్షానికి శనగ పంటలో పూత రాలిపోతోంది. శనగలో పూత రాలిపోవడంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీలో కోటి ఆశలతో శనగ సాగు చేసిన రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో దాదాపు వేల ఎకరాల్లో పప్పు శనగపంట సాగు చేశారు. తుపాను వర్షాలకు పప్పు శనగ పంటలో పూత నేలరాలుతోంది. ఇప్పటికే 70 రోజులు శనగ పంట పూర్తయ్యిందని, మళ్లీ పూత వస్తుందని ఆశ లేదని రైతులు వాపోతున్నారు.

దీంతో ఆశించిన దిగుబడి రాకపోవచ్చునని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు అప్పులు చేసి శనగ పంటను సాగు చేస్తే పెట్టుబడులైనా వస్తాయా, లేదా అన్న సందేహంలో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే శనగ పంటకు తెగుళ్లు సోకడంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి మందుల పిచికారీ చేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్షలు పెట్టుబడి పెట్టా



శనగ పంట సాగుకు ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేశా. లక్షల వ్యయంతో శనగ పంటను సాగు చేశాను. ఇటీవల కురిసిన వర్షానికి పూత రాలిపోయింది. కొత్త పూత వచ్చినా 15 శాతం మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. భవిష్యత్‌లో పప్పు శనగ పంట సాగు చేయాలంటే భయంగా ఉంది.

– ఆదినారాయణరెడ్డి, శనగ రైతు, సింహాద్రిపురం

నాలుగు ఎకరాల్లో శనగ పంట సాగు చేశా



నాలుగు ఎకరాలలో శనగ పంటను సాగు చేశాను. 10 రోజుల క్రితం పూత దశలో ఉన్న పంటను చూసి ఈ ఏడాది ఆశించిన దిగుబడి కంటే ఎక్కువ వస్తుందని అనుకున్నా. కానీ శనగ పంటకు ఎర్ర తెగులు సోకడంతో పంట పూర్తిగా దెబ్బతినడంతో మందులు పిచికారి చేసినా తెగుళ్ల నివారణ కాలేదు. దీంతో శనగ పంటలో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– చంద్ర, శనగ రైతు, సింహాద్రిపురం

ఉపాధి పనుల నిర్వహణపై సామాజిక బృందం తనిఖీ

పెద్దముడియం : ఉపాధి హామీ పనుల్లో జరిగిన పొరపాట్లు, తప్పిదాల వల్ల దుర్వినియోగమైన రూ.32,354 అధికారులు రికవరీ చేశారు. ఉపాధి పనులపై గ్రామాల్లో నిర్వహించిన వాటిని సామాజిక తనిఖీపై బృంద సభ్యులు 18వ సామాజిక తనిఖీ సమావేశం బహిరంగ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కె.కె.సుధ అధ్యక్షతన శుక్రవారం మండలస్థాయి సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ఆదిశేషారెడ్డి, ఎంపీడీ రామలింగేశ్వరరెడ్డి, ఎస్‌క్యుసి రాంప్రసాద్ హాజరై పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన 594 పనులకు గాను రూ.7,83 కోట్లు ఖర్చు చేసిన వాటిపై ఎస్ఆర్పీ కన్నారెడ్డి ఆధ్వర్యంలో పలువురు సామాజిక తనిఖీ సభ్యులు గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టి నివేదించారు. వీటిని గ్రామాల వారీగ ఉపాధి పనులు చేపట్టిన విధానం, వాటి నిర్వహణ తీరు సిబ్బంది గ్రామాల్లో పనులు చేయించిన విధానంపై సభలో చదివి వినిపించారు. అయితే పలు గ్రామాల్లో పక్కదారి పట్టినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు రికవరీకి ఆదేశించారు. మొత్తం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కలిసి రూ.32,354 రికవరీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫంషీద్‌బాను, ఏపీవో వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, స్వీట్ల పంపిణీ ఉంటుందని వైఎస్సార్‌సీపీ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ అధినాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

కమలాపురంలో..

కమలాపురం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి తెలిపారు. వేడుకలకు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డ్రమ్ సీడర్‌తో వరి సాగు లాభదాయకం



డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగును పర్యవేక్షిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వల్లూరు : డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు లాభదాయకమని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిన్న లేబాకలో జగన్‌మోహన్ రెడ్డి అనే రైతు పొలంలో శుక్రవారం వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాన్ని వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన వరి నారు పోయడంతో పాటు నాటు వేయడం ఆలస్యం కావడం వలన దిగుబడులు తగ్గే అవకాశాలు వున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు ఉపయోగకరమన్నారు. ఈ పద్ధతిలో వరిసాగు వలన సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చునన్నారు. ముఖ్యంగా వరి విత్తనాల ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. నారు పెరకడం, నాటు వేయడం వంటి పనుల కోసం పెట్టే కూలీల ఖర్చులు పూర్తిగా మిగులుతాయన్నారు. మొక్కల సాంద్రత ఖచ్చితంగా వుండటం వలన మంచి దిగుబడులు వస్తాయన్నారు. యంత్రాలతో కలుపు నివారించుకోవచ్చునన్నారు. అయితే ఈ పద్ధతి నీటి ముంపునకు గురయ్యే పొలాలు, చౌడు నేలలకు అనువు కాదని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ లాలిత్యారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : దాల్మియా పరిశ్రమ ఏర్పాటు చేసిన తర్వాత చుట్టు పక్కల గ్రామాలైన నవాబుపేట, దుగ్గనపల్లి గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి గ్రామాలకు, రైతులకు న్యాయం చేయాలని శుక్రవారం ఆర్డీఓ సాయిశ్రీకి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి వివరించారు. దాల్మియా పరిశ్రమ ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన రైతు పరిశ్రమపై కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు పరిశ్రమ వల్ల రైతులు పడే ఇబ్బందులపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ కార్యదర్శి నీరబ్ చౌదరి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యురాలైన ఆర్డీఓ సాయిశ్రీని రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. దాల్మియా పరిశ్రమ వంకలో ఏర్పాటు చేశారు. వర్ష కాలంలో అలుగోకు వంక ఎక్కువ వేగంతో పారుతుంది. దాల్మియా పరిశ్రమ యాజమాన్యం వంకపై గోడ నిర్మాణం చేపట్టారు. భారీ వరద ప్రవహించే అలుగోకు వంక గోడ నిర్మాణం వల్ల నవాబుపేట, దుగ్గనపల్లి, చిన్న కొమెర్ల గ్రామాలలో ప్రవహిస్తుంది. అంతేకాకుండా దాల్మియా పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వల్ల రైతులు సాగుచేసిన పంటలపై బూడిద పడటం వల్ల సాగు తగ్గిపోతుందన్నారు. గతంలో ఎన్నో సార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదన్నారు. ఇప్పుడైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ



వేంపల్లెలోని నూతన ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

వేంపల్లె : పట్టణంలోని కడప రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండును పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ తనిఖీ చేశారు. శుక్రవారం అసిస్టెంట్ మేనేజర్ కులాయప్పతో కలిసి బస్టాండ్‌లో నిర్మించిన ప్లాట్‌ఫాంలు, షాపింగ్ గదులు, కంట్రోలర్ గది, మూత్రశాలలు తదితర వాటిని పరిశీలించారు. సాక్షి దినపత్రికలో నూతన బస్టాండు పూర్తయినప్పటికీ ప్రారంభించకపోవడంతో »ఇంకెన్నాళ్లీ నిరీక్షణఅనే కథనం ప్రచురితం కావడంతో అధికారులలో చలనం వచ్చింది. వెంటనే ఇంకా ఏమైనా పెండింగ్ పనులు ఉన్నాయా అని అధికారులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ 2.20కోట్ల ఆర్టీసీ నిధులతో నూతన బస్టాండ్ నిర్మించడం జరిగిందన్నారు. ఇక్కడ అన్ని వసతులు కల్పించామని.. అందుకు సంబంధించిన కంట్రోలర్, సిబ్బందిని కూడా నియమించామన్నారు. ఇప్పటికే బస్టాండ్ పూర్తయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తే త్వరలో ప్రారంభిస్తామన్నారు. బస్టాండు నిర్మించినప్పటికీ ప్రారంభించకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే మహిళలు, వృద్ధులు, మహిళా కండక్టర్లు మల, మూత్ర విసర్జనలకు వెళ్లాలంటే చాలా అవస్థలు పడుతున్నారని స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆర్టీసీ సిబ్బంది మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. గుండె జబ్బులకు సంబంధించి టోటల్ ప్యాకేజీ కింద రూ.1800లకు సీబీసీ, టీఎంటీ, 2డీ ఏకో, ఎఫ్‌సీపీ, ఈసీజీ టెస్టులను నిర్వహిస్తారని తెలిపారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులకు వైద్య చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. షుగర్ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పెండ్లిమర్రి : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈనెల 27వ తేదీన వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలో పర్యటన ఉన్నందున పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లును శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డిలు పరిశీలించారు. వెల్లటూరు రైతులు సాగుచేసిన చామంతి, మినుము పంటలను పరిశీలించారు.

ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విక్రయించాలి

కమలాపురం : యూరియా తదితర ఎరువులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని కడప ఏడీఏ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిష్టర్‌లను, నోటీస్ బోర్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాదారులు చట్టంకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. యూరియా తదితర ఎరువులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. అలాగే స్టాక్ రిజిష్టర్‌కు, గోడౌన్లలో ఉన్న నిల్వలకు వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. ఎరువులు కొనే రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డును తప్పని సరిగా షాప్‌లో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, డీలర్లు పాల్గొన్నారు.

భ్రమరాంబదేవి అలంకారంలో వాసవీమాత

వేంపల్లె : పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాస పూజలలో భాగంగా శుక్రవారం వాసవీమాత భ్రమరాంబదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారికి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.